తప్పకుండా వెళ్ళాలనుకున్నాను— రాజ్యం వద్దకు. వెళ్ళాను అనుకున్నట్లే. నేను వెళ్ళిన సమయంలో ఆమె ఇంట్లో లేదు. ఆమె తల్లి చెప్పింది— పక్కింటి వాళ్ళమ్మాయి పిలిస్తే వెళ్ళిందని. "కూర్చో... పిలుస్తాను" అంటూ వెళ్ళింది. ఆమె నాకు అత్తయ్య. నేను మంచం మీద కూర్చొని వేళ్ళు విరుసుకుంటున్నాను. రాజ్యం వొచ్చింది తలొంచుకొని. నా రాక ఆమెలో కంగారుని కలిగించినట్లుగా ఆమె మొహంలో ఏదో బిడియం కదలాడుతుండటం నా దృష్టిలో పడింది.

నేను రాజ్యంతో ఏం మాట్లాడాలో అని సతమతమవుతుంటే అత్తయ్య కొబ్బరి నీళ్ళు తీసుకొచ్చింది పెద్ద గ్లాసుతో. నేను బుద్ధిమంతుడవడం వల్ల కాదనకుండా తాగేశాను అన్నీ. తాగాక అనుకున్నాను మొత్తం తాగేశానే. కొన్నయినా రాజ్యానికి ఇవ్వుండాల్సిందనీ. వాళ్ళకి పెరట్లో రెండు కొబ్బరి చెట్లున్నాయి. వచ్చిన అతిథులకు కొబ్బరి నీళ్ళివ్వడం అత్తయ్యకు అలవాటై పోయింది.

అత్తయ్య కనిపెట్టింది మేము మౌనంగా ఉండటం. "దొడ్లో చల్లగా ఉంటుంది బాబూ" అంది నర్మగర్భంగా. మాకు ఏకాంతాన్ని కలిగించడానికి అత్తయ్య అన్న ఆ మాటలు పన్నీటిలా అన్పించాయి నాకు. నేను లేచి రాజ్యం వంక చూసి దొడ్లోకి నడిచాను. వెనకాలే వొచ్చింది రాజ్యం.

ఆ సాయంకాలం మహా ఆహ్లాదకరంగా ఉంది. ఎటుచూసినా చెట్లు... చెట్లే— పచ్చగా... అందంగా. పక్షుల కిలకిలారావాలు ముచ్చటగా ఉంది ఆనాటి సంధ్యారాగం.

నేను జామచెట్టు కింద నిల్చొని దోరగా ఉన్న జామపండు నొకదాన్ని కోశాను. కొంచెం కొరికాను. తియ్యగా ఉంది. నేను రుచిచూసిన జాంపండుని రాజ్యానికిచ్చాను. సంశయిస్తూ తీసుకుంది. "తిను రాజ్యం" అన్నాను ప్రేమగా. సిగ్గుగానే పండుని కొరికి నెమ్మదిగా నములుతోంది. కొంచెం తిననిచ్చి చటుక్కున ఆమె చేతిలో మిగిలిన దాన్ని లాక్కుని నోట్లో వేసుకున్నాను. నా చర్యకు సిగ్గుతో మొహాన్ని ఎర్రగా వేసుకుంది రాజ్యం.

"రాజ్యం! ఇందాకటి కంటే ఇప్పుడు మరీ తియ్యగా ఉంది పండు" అన్నాను మత్తుగా చిలిపిగా. అటు తిరిగింది ఏమీ మాట్లాడకుండా.

నేను గభాల్న ఆమె భుజాలు పట్టుకొని నా వేపుకు తిప్పుకున్నాను. మూతి బిగించి ఉంది. నేను చిన్నగా నవ్వుకున్నాను. రాజ్యం మూతి బిగిస్తే మరీ ముచ్చటగా ఉంటుంది నాకు.



"రాజ్యం! నా ఉత్తరానికి జవాబు రాయలేదే" అడిగాను నా పక్కన కూర్చోబెట్టుకుంటూ. అయినా నోరువిప్పలేదు ఆమె. ఓ నిమిషం ఆమె వైపు నుండి సమాధానం కోసం ఆశించి రాకపోయేసరికి "ఎంతగా నిరీక్షించానో నీ ఉత్తరం కోసం. పోస్ట్‌మాన్ వచ్చేవరకు ఆగడం చేతకాక దూరమైనా రోజూ తొమ్మిది కాకముందే పోస్టాఫీస్‌కి హాజరయ్యి పోస్ట్‌మాన్‌ని కనుక్కునేవాడ్ని. ఓ సారి ఏమీ రాలేదని చెప్పేవాడు. నిరాశతో కాళ్ళీడ్చుకుంటూ వొచ్చేవాడ్ని. ఇంకోసారి వొచ్చిందని చెప్పి ఇచ్చేవాడు. మహదానందపడిపోతూ చూసేసరికి అది నా స్నేహితుల నుండో, ఇంటినొండో అయి ఉండేది. నిస్పృహతో ఆ రోజు ఇక కాలేజీకి వెళ్ళడం మానుకునేవాడ్ని. పది రోజులు ఇలాగే గడిచాయి. నీ స్తబ్దత నన్నెంతగా వేధించిందో ఏం చెప్పను? ఇప్పుడు సెలవులు వచ్చాయి కనుక నిమిషం ఉండలేకపోయా నక్కడ. వెంటనే వొచ్చేశాను" ముగించి ఆమె వంక చూస్తే— కన్నీరు ధారగా కురుస్తోంది ఆమె కళ్ళ నుండి.

నిరుత్తరుణ్ణయి "ఏమైంది రాజ్యం?" అన్నాను ఆదుర్దాగా. నేనేమైనా తప్పుగా మాట్లాడానేమోనని నా మాటల్ని తిరిగి మననం చేసుకున్నాను. పొరపాటేమీ కన్పించలేదు. మరామె ఎందుకేడుస్తున్నట్లు? "నా ఉత్తరం కోసం నిజంగా అంతలా ఎదురు చూశావా బావా! నీవు పడిన కష్టం విని నిజంగా ఏడుపొచ్చింది" ఇక నాకు నవ్వాగలేదు— ఆమె ఏడుపుకి కారణం విని.

"ఓహ్! చంపేశావు! ఇందుకేనా నువ్వు ఇంతగా ఏడ్చింది" అని నేను బిగ్గరగా నవ్వుతుంటే కొరకొరా చూసింది ఆ అమ్మాయి.

నేనామె దగ్గరగా జరుగుతూ "ఇంతకీ నా ఉత్తరానికి రిప్లై ఎందుకీయలేదు?" అడిగాను. మూతి సడలించిందప్పుడు. "మరేం వేయమంటావు? నువ్వేమో ఇంటర్మీడియట్ పాసయితేనే పెళ్ళిచేసుకుంటానని చెప్పావు. నాకు కెమిస్ట్రీలో పోయింది. ఎట్లా వేసేది ఉత్తరం? ఎంత బాధపడ్డానో అప్పుడు? నీకు తెలిస్తే ఏమనుకుంటావో— నిజంగా నన్ను కాదంటావేమోననే భయంతో విలవిలలాడి పోయాను. తలుచుకుంటే ఇంకా వొణుకు పుడుతూనే ఉంది"

"పోనీలే! సెప్టెంబర్ కయినా పూర్తి చేస్తావు కదా" అన్నాను. కొద్ది క్షణాలు ఆలోచించి "తప్పదా అయితే! సరే చేస్తాలే" అంది.

"అబ్బ. చంపకు బావా! అలాగే అంటున్నా కదా" అంటూనే చేతిలో చేయివేసింది. ఆ చేయిని అలాగే గట్టిగా పట్టుకొని మీదికి లాక్కున్నాను. ఆ హాయైన వాతావరణంలో నెచ్చెలి తోడుగా వుంటే ఏ చెలికాడి మనసు అదుపుతప్పదు.

"అబ్బా! ఉండు బావా! అమ్మ చూస్తుంది" అంటున్నా వినిపించుకోకుండా రాజ్యాన్ని కౌగిలించుకుని ఆమె దొండపండు పెదాలను నా మోటు పెదాలతో అందుకున్నాను. అప్పుడే పండిన జాంపండుని కొరికిన రామచిలుక మమ్మల్ని చూసి మరింత కసితో జాంపండుని కొరికింది.

— బుద్ధి యజ్ఞమూర్తి.